# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మీ గంగా భవాని.

*గత సంచికలలో ...*

*మద్రాసు (నేటి చెన్నై, అలనాటి చెన్నపట్నం) చేరుకుని, బోర్డింగ్ పాసులు తీసుకుని, కస్టమ్స్ క్లియరెన్స్ పూర్తి చేసుకుని, బోర్డింగ్ పూర్తి అయ్యాక మాకై నిర్దేశించిన సీట్లలో కూర్చున్నాం! విమానం గాల్లోకి ఎగిరింది. వర్షం పడుతున్నట్లు కిటికీ అద్దంమీద పడుతున్న నీటి తుంపరలు, దూరంగా కనిపిస్తున్న మెఱుపులు తెలియజేస్తున్నాయి. టీ.వీ చూస్తూ వినడానికి ఇయర్ ఫోన్ సెట్ ఇచ్చారు.*

### శ్రీ గురుభ్యోనమః

## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

పది నిమిషాల తక్కువ 12 గంటలకి రకరకాల ఘన, ద్రవ పదార్థాల పేర్లు గల లిస్టు చిన్న కేటలాగు లాంటిది ఇచ్చారు. లిస్ట్ చదువుకున్నాకా, ఎవరికి ఏది కావాలంటే అది ఇస్తారు. 12 గంటల 10 నిమిషాలకి డ్రింక్‌లు తీసుకువచ్చారు; హాట్, కూల్, ఎవరికి ఏదంటే అవి ఇచ్చారు. మేం ఆరంజి జ్యూస్ తీసుకున్నాము. 12 గంటల 30 నిమిషాలకి టిఫిన్ ఇచ్చారు. అవేవీ మేం తీసుకోలేదు. అంతకు ముందు ఇచ్చిన కారం వేసి అందంగా పేక్ చేసిన వేరుశనగ పలుకుల పేకెట్లు తీసుకున్నాము. అందరూ తినడం, తాగడం అయ్యాక ఖాళీ చేసిన ప్లేట్లు, ట్రేలు, గ్లాసులు, అన్నీ తీసి శుభ్రం చేసారు. అన్నీ అమర్చి పెట్టడం, తియ్యడం, అంతా ఒక పద్ధతిగా ఉంది. ఎలా అంటే వేరుశనగ పలుకులు తిన్నాకా మూతి తుడుచుకోడానికి పేపరు కూడా ఆ పేకెట్‌లో పెట్టబడివుంది. కాఫీ కావాలంటే, చిన్న ట్రేలో కప్పులో కాఫీ డికాషన్, ఒక స్టీలు చెమ్చా, రెండు చిన్న చిన్న పేకెట్లు పంచదార, పాలపొడి, అమర్చి ఇచ్చారు. టిఫిన్ తీసుకున్న వాళ్ళకి కూడా అలాగే రకరకాల చిన్న, పెద్ద, అందమైన ప్లాస్టిక్ డబ్బాల్లో, మూతలతో సహితంగా కిందవేసుకునే పేపరు, చేతులు తుడుచుకునే పేపరు, ఆ ట్రేలోనే సీలు చేసిన మంచినీళ్ళ ప్లాస్టిక్ డబ్బా, అన్నీ చూడ్డానికి చాలా ఆహ్లాదంగా వుంటుంది. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాకా, అందరికీ రెండేసి పెన్నులు వున్న పేకెట్ ఇచ్చారు. మద్రాసు నుంచి, సింగపూర్ వరకు జరిగిన మూడు గంటల ప్రయాణంలో, ఆ అమ్మాయిలంతా అలా తిరుగుతూనే వున్నారు. ఎవరికి ఏది కావాలంటే అవి అందిస్తూనే వున్నారు. మూడు గంటల ప్రయాణంలో మూడు శరీరాలతో పొందగలిగే అనుభవాలు అన్నీ కలిగాయి. జాతి, మతము, కులము, భాష, స్థూల శరీరానికే గాని, సూక్ష్మ శరీరానికి లేవు. స్థూల శరీరాన్ని విడిచి ప్రయాణం చేసే సూక్ష్మ శరీరానికి ఏవీ అడ్డురావు. చేసిన ధర్మం చెడని పదార్థంగా వెంట వుండి ప్రయాణం చేయిస్తుంది. ఫ్లైట్‌లో అడుగుపెట్టినది మొదలు అంతా అంతర్గత వైభవమే.

స్థూల శరీరంతో వున్నప్పుడు - వర్షం పడితే తడిసిపోతాం అని భయం, మెఱుపు చూస్తే కళ్ళు పోతాయని భయం, చూసే వాళ్ళని చూడకండి అని జాగ్రత్తలు చెప్పడం. మెఱుపులు మెరుస్తుండగా నీళ్ళలోకి వెడితే షాక్ తగులుతుందని భయం. అవేవీ సూక్ష్మ శరీర అనుభవంలో లేవు - నీటిచేత తడవబడదు; నిప్పుచేత కాల్చబడదు; దేనికీ అంటదు; ఏదీ ఆటంక పరచలేదు; అన్న అనుభవం - వర్షంలో మెఱుపుల్లో విమానం దూసుకుపోతుంటే కలిగింది. గాఢాంధకారంగా ఆకాశదర్శనం. దూరమయే పట్టణ దీపాల కాంతి నక్షత్ర మండల దర్శనంగా, తటిల్లతగా, మెఱుపుతీగలతో పాటు ఎన్నో దివ్యమైన భావనలు ఆ క్షణంలో కలిగాయి. ఆ ప్రయాణానికి అవసరమైన భాష రాకపోయినా, దారి తెలియక పోయినా, ఈ జీవుడికి సంబంధించిన వారు తోడుగా వుండి ప్రయాణం చేయిస్తారన్నదానికి నిదర్శనం ఈ అమెరికా ప్రయాణం. కారణంగా ఉన్నది ఏదో? రూపం ధరించి, దాచుకున్నది పెట్టుబడిగా పెట్టించి దేశ, కాలాలకి అనుకూలమైన వస్తువులుగా మార్పించింది. ప్రయాణంలో జీవుడికి అలసట లేకుండా, ఆకలి దప్పికలు కలగకుండా చేసిన సదుపాయాలన్నీ ఆ విధంగా అనిపించాయి. గమ్యస్థానాన్ని చేర్చేవరకు మార్గదర్శకులు వారి వారి కర్తవ్య పాలన చేస్తారు. చేసిన కర్మము చెడని పదార్థము. ఎవరి అనుభవం వారిది; ఎవరి ఆహారం వారిది; ఎవరికీ వేరేవారి ఆహారంతో గాని, వినోదంతో గాని సంబంధం లేదు. ఎవరెవరి కర్మఫలం వారికి అంది తీరుతుంది.

*స్థూల శరీరంతో వున్నప్పుడు - వర్షం పడితే తడిసిపోతాం అని భయం, మెఱుపు చూస్తే కళ్ళు పోతాయని భయం, చూసే వాళ్ళని చూడకండి అని జాగ్రత్తలు చెప్పడం. మెఱుపులు మెరుస్తుండగా నీళ్ళలోకి వెడితే షాక్ తగులుతుందని భయం. అవేవీ సూక్ష్మ శరీర అనుభవంలో లేవు - నీటిచేత తడవబడదు; నిప్పుచేత కాల్చబడదు; దేనికీ అంటదు; ఏదీ ఆటంక పరచలేదు;*

మద్రాసు ఎయిర్ పోర్ట్‌లో టిక్కట్లు చూపించినప్పుడు బోర్డింగ్ పాస్ ఇస్తారు. అందులో మాంసాహారమా? శాఖాహారమా? ఫలాల ఆహారమా? అన్నది నోట్ చేస్తారు. ప్రయాణం చివరివరకు ఆ నెంబరు గల సీటు దగ్గరకి, ఆ ఆహారం అందించబడుతుంది. స్థూల శరీరంతో చేసి, సూక్ష్మ శరీరంమీద పడిన ముద్రలు చివరి మజిలీ వరకు చెరిగిపోవు. మద్రాసులో కంప్యూటర్‌లోకి ఎక్కిన సమాచారం, సింగపూర్ వెళ్ళినా, అమెరికాలో అడుగుపెట్టినా మారదు. చెక్కుచెదరకుండా అలాగే రికార్డయి వుంటుంది. మధ్యలో మార్పు చేసుకునే అవకాశంలేదు. ముందుగానే రికార్డయిన కంప్యూటర్ సమాచారాన్ని బట్టి ఎవరికి ఎలాంటి సహాయసహకారాలు కావాలన్నా చేస్తారు. నడవలేనివారిని చక్రాల కుర్చీలో కూర్చోపెట్టి, వీల్ ఛైర్ అసిస్టెంటుగా కూడా వుండి, వాళ్ళ అవసరాలు తీర్చి, ఫ్లైట్‌లోకి తీసుకువెళతారు. ఏ మాత్రం శ్రమ పడవలసిన పనిలేదు. భారతదేశ కాలమానప్రకారం, 5 నిమిషాలు తక్కువ 3 గంటలకి సింగపూర్ వస్తున్నట్టు, టి.వి.లో టైమ్ చూపించారు. అక్కడి కాలమానం ప్రకారం ఉదయం 5 గంటల 25 నిమిషాలు.

(మరికొన్ని విషయాలు వచ్చే సంక్రాంతి సంచికలో ...)